క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

గుడివాడ టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని గుడివాడ కేబీఆర్ గవర్నమెంట్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. గౌరీమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, 8వ తరగతి పాసైన యువతీ యువకులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. గవర్నమెంట్ ఐటీఐ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో మే 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 08674-295953, 82975 74757లను సంప్రదించవలసిందిగా కోరారు.

స్వామివారి నిత్యాన్నదానానికి రూ.10వేలు విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి గుడివాడ వాస్తవ్యులు తోట దుర్గాప్రసాద్ మంగళవారం రూ.10,116 విరాళంగా అందజేశారు. ఉదయం ఆలయానికి చేరుకున్న దుర్గాప్రసాద్ కుటుంబసభ్యులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావుకు విరాళాన్ని అందించారు. ఆలయ మర్యాదలతో దాత కుటుంబ సభ్యులను సత్కరించారు. ఆలయ అధికారి చెన్నకేశవ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడ టౌన్: ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలు తెలియజేసేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజర్ డీ రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్‌తో మాట్లాడదలచిన వారు 99592 25464ను నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలకు ఎంపిక



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసుటికల్ సైన్సెస్ కళాశాలలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో బీ ఫార్మసీ ఫోర్త్ ఇయర్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. ఎనిమిది మంది ట్రైనీ మెడికల్ కోటర్‌గా ఉద్యోగాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

మజ్జిగ పంపిణీ



గుడివాడ టౌన్: తారక రామా వాకర్స్‌క్లబ్ గుడివాడ, తెలుగు మహిళా వాకర్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీనివాస సెంటర్‌లో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 54వ ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎం. బ్రహ్మయ్య, మహిళాక్లబ్ అధ్యక్షురాలు వై. సంధ్యారాణి, మాజీ అధ్యక్షులు సయ్యద్ మహ్మద్ అలి, దండమూడి సీతారామస్వామి, రామకృష్ణ, టీ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



అడ్డాడ(పామర్రు): మండల పరిధి అడ్డాడ గ్రామంలోని అరవింద హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంగళవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా పామర్రు ఎంఈవో-2 పద్మవాణి మాట్లాడుతూ మండల పరిధిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన కే ధృతిశ్రీ 586, సీహెచ్ హాసిని 581, కొల్లి లేఖ్య 571 మార్కులు సాధించారని తెలిపారు. వారికి వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల నగదును దాత పాఠశాల కరస్పాండెంట్ పీ నాగార్జున రాజు అందజేశారు. అకాడమిక్ అడ్వైజర్ పీఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ ఎస్ రమణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు గౌరవమేదీ.?

పామర్రు ఎంపీపీ అశోక్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

పామర్రు: మండలంలోని ప్రజాప్రతినిధులకు ఏ విధమైన గౌరవం లేకుండా ప్రస్తుత ప్రభుత్వ నాయకులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సభ్యుల సమావేశం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఎంపీపీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ తన బాధను వెళ్లబుచ్చారు. పామర్రు మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు తనను కావాలనే ఆహ్వానించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసింది వైఎస్సార్ సీపీనే అని గుర్తుచేశారు. అయితే కూటమి నేతలు, అధికారులు సీహెచ్‌సీ భూమి పూజకు తనకు కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా చేశారని అన్నారు. మండలంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తమకు ఏవిధమైన అధికారాలు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. మండల పరిధి నెమ్మలూరు గ్రామంలో గత కొన్ని రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామ సర్పంచ్, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కనీస చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు విలువ లేకుండా కనీస సమాచారం ఇవ్వకుండా ప్రస్తుత పాలకులు పనులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వాకౌట్ చేసిన సభ్యులు

ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. దీని కారణంగా ఈ సమావేశానికి ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరయ్యారన్నారు. ఏ విధమైన గౌరవం లేకుండా అగౌర పర్చే విధంగా కూటమి నేతలు చేస్తున్న పనులకు నిరసనగా సమావేశం నుంచి వాకౌట్ అవుతున్నానని ఎంపీపీ అశోక్‌కుమార్ తెలిపి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎంపీపీతో పాటుగా వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, నెమ్మలూరు సర్పంచ్ గోపాలం వాకౌట్ చేసిన వారిలో ఉన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



కిశోర వికాసం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీఎం వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు

పమిడిముక్కల: బాల్య వివాహాలను అరికట్టాలని వెలుగు ఏపీఎం వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసంపై ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎస్‌కేలు, ఆశావర్కర్లకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి 100 మందిలో 29 శాతం బాల్య వివాహాలు జరుగుతున్నాయని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనిత, ఝాన్సీ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. మహిళా పోలీస్ కన్వీనర్‌గా అంగన్‌వాడీ కార్యకర్త, సచివాలయ ఏఎన్ఎం, ఆశా వర్కర్, వీఓఏలతో కమిటీలు ఏర్పడాలని సూచించారు. అనంతరం కిశోర వికాసం పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కిశోర వికాసం కమిటీ సభ్యులకు శిక్షణ తరగతులు

పామర్రు: స్థానిక వెలుగు కార్యాలయంలో మండల పరిధిలోని 17 సచివాలయాల్లోని కిశోర వికాసం విలేజ్ లెవెల్ కమిటీ సభ్యులకు శిక్షణ తరగతులను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నూతక్కి సత్యశ్రీ, ఎస్ విజయకుమారి మాట్లాడుతూ కమిటీ సభ్యులు వారి వారి సచివాలయాల పరిధిలో 15 నుంచి 18 ఏళ్ల కిషోర బాలికలను గ్రూపులుగా చేసి ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో విలేజ్ లెవల్‌లో మీటింగ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సీహెచ్ తిరుపతయ్య, కనుమూరు పీహెచ్‌సీ నుంచి పీహెచ్ఎన్ కే నిర్మల, వెలుగు సీసీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ కృష్ణ

కైకలూరు: మైనర్లు వాహనాలు నడిపితే వారిపై కేసుతోపాటు బండి యజమానులు, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని కైకలూరు పట్టణ సీఐ పీ కృష్ణ హెచ్చరించారు. పట్టణంలో వాహనదారులకు మంగళవారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్సు పొందాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే రూ.5 వేలు జరిమానా మేజిస్ట్రేట్ విధించే అవకాశం ఉందన్నారు. ఈ కేసులో యువకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారన్నారు. దీని వల్ల భవిష్యత్తులో పాస్‌పోర్టు, ఇతర ఉద్యోగాలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. అదేవిధంగా వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హెల్మెట్ లేకపోతే రూ.1000 జరిమానా వేస్తామన్నారు. చిట్టి వెహికల్స్ పేరుతో గ్రామాల్లో పోలీసుశాఖ అందిస్తున్న పలు సేవలు, యాప్‌ల పనితీరు, వేసవిలో దొంగతనాల నివారణ వంటివి ప్రచారం చేస్తున్నామని తెలిపారు.

వైభవంగా శాంతి కల్యాణం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామి జన్మ నక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా ఈ కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆవరణలోని వేదికపై ఉంచి అందంగా అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. పలువురు భక్తులు ఈ కల్యాణంలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

విద్యుత్ కోతలపై ఆగ్రహావేశాలు

ముదినేపల్లి రూరల్: మండలంలో విద్యుత్ కోతలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సింగరాయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఎడాపెడా విధిస్తున్న కోతల వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత సమయాల్లో కోతలు విధిస్తే ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటామని ఆ విధంగా కాకుండా ఎప్పుడు పడితే అప్పుడు కోతలు విధిస్తున్నందున అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అధికారికంగా విద్యుత్ కోతలు విధించే పక్షంలో నిర్దేశిత సమయాలను ప్రకటించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: నున్న నుంచి గుడివాడ వరకు 220 కేవీ కండక్టర్లు, గుడివాడ 11కేవీ హెచ్‌డీ ఫీడర్ల మార్పిడి కారణంగా బుధవారం ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు నందివాడ మండలం పుట్టగుంట, జనార్ధనపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ విడత మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నందివాడ, పెదపారుపూడి, దోసపాడు, జనార్ధనపురం, తమలంపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని దోసపాడు ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం సాయంత్రం మూడు నుంచి ఆరు గంటలకు వరకు, అలాగే గురువారం ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు 220 కేవీ టవర్ లైన్ వైర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ ఎస్ వరకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోసపాడు ఫీడర్ పరిధిలో దోసపాడు, తమ్మలంపాడు, వింజరంపాడు, మోపర్రు గ్రామాల్లో గృహ, ఆక్వాకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



గుడివాడలో పుస్తక పఠనంపై శిక్షణ ఇస్తున్న గ్రంథాలయ అధికారి శాంతి



పామర్రులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



ముదినేపల్లి గ్రంథాలయంలో విద్యార్థులు



కోరుకొల్లులో క్విజ్ పోటీల్లో చిన్నారులు

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పుస్తక పఠనం, దాని ప్రాముఖ్యతపై తరగతులు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారిణి పీ శాంతి తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ఈ తరగతులు కొనసాగుతాయని చెప్పారు. పలు అంశాలపై విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

పామర్రులో..

పామర్రు: స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. పామర్రు గ్రంథాలయ అధికారి ఝాన్సీరాణి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల పుస్తకాలు, నీతి కథలు చెప్పించడం జరిగిందని తెలిపారు. అలాగే జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో ఉపాధ్యాయురాలు నిమ్మగడ్డ మాధవి విద్యార్థులకు వేమన పద్యాలు, పంచతంత్ర నీతి కథలు, తెలుగు-హిందీ పద ఉచ్చరణపై తరగతులను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి నాగసురేష్, పాఠకులు పాల్గొన్నారు.

మండవల్లి: గ్రంథాలయంలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలు వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి ఎస్‌కే పర్వీనా పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ప్రతి విద్యార్థి ఒక నీతి కథను చదివి దాని సారాంశం మిగతా విద్యార్థులకు వివరించారు.

ముదినేపల్లి రూరల్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంతాలయంలో విద్యార్థులు మంగళవారం పుస్తక పఠనం చేశారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి విజ్ఞన సంబంధమైన పుస్తకాలను విద్యార్థులకు అందజేసి పఠనం చేయించారు.

పెదపారుపూడి: మండలంలోని పెదపారుపూడి గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థుల చేత పుస్తకాలు చదివించడం, కథలు చెప్పడం, తెలుగు రైటింగ్, తెలుగు నుంచి ఇంగ్లీషు పదాలు ప్రాక్టీస్ చేయడం జరిగింది. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎంవీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

కైకలూరు: గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. కలిదిండి మండలం కోరుకొల్లు బ్రాంచి గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఆర్ రాఘవులు మంగళవారం విద్యార్థులకు క్విజ్, చదరంగం పోటీలను నిర్వహించారు. కోరుకొల్లు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ బీ ప్రసాద్ క్విజ్ నిర్వహణలో సహకరించారు.

చేపల చెరువులకు బహిరంగ వేలం

నిమ్మకూరు(పామర్రు): మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామంలో నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి - సాధికారత కేంద్రం మహిళా ప్రాంగణంలో ఉన్న చేపల చెరువులు, కొబ్బరి చెట్లకు బహిరంగ వేలం వచ్చేనెల ఐదవ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మహిళా ప్రాంగణం మేనేజర్ జుబేదా పర్వీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంగణ పరిధిలోని మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రెండు చేపల చెరువులు, 158 కొబ్బరి చెట్లు ఉన్నాయని తెలిపారు. ప్రాంగణం అభివృద్ధికి చేపల చెరువులు, కొబ్బరి చెట్లు లీజుకు ఇచ్చుటకు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ఈ బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని అన్నారు. చేపల చెరువుల లీజు కోసం ధరావత్తు సొమ్ము రూ.30వేలు, కొబ్బరి చెట్లు లీజుకు రూ.20వేలను వచ్చేనెల నాలుగవ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు చెల్లించాలని సూచించారు.

ధర్నాలను విజయవంతం చేయండి

ముదినేపల్లి రూరల్: విద్యారంగ సమస్యలపై ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని సంఘ నాయకులు సీహెచ్ నాగమల్లేశ్వరరావు, కె.కృపాకర్ కోరారు. ముదినేపల్లిలో మంగళవారం మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలు లేదా ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు కొనసాగించాలని, పెండింగ్ డీఏల మంజూరు, 11వ పీఆర్సీ ఆర్థిక బకాయిలతో పాటు అన్ని రకాల బకాయిలను విడుదల చేయాలనే డిమాండ్లతో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా మే 5న పాత తాలుకా కేంద్రాల వద్ద, 9న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట, 14న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు.



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

ఎన్డీఆర్ఎఫ్ మాక్‌డ్రిల్

వరదలు, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన సహాయక చర్యలపై ఎన్డీఆర్ఎఫ్ బృందం మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించింది. మండలంలోని భద్రిరాజుపాలెం వద్ద కృష్ణా కరకట్టపై ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ దరిప్ప నేతృత్వంలో సిబ్బంది వరద సహాయక చర్యలు, సన్నద్ధతపై మాక్‌డ్రిల్ చేశారు.

- తోట్లవల్లూరు



అత్యవసర వైద్య శిబిరం



సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ఏడీఏ శ్రీనివాస్

పమిడిముక్కల: రసాయన ఎరువుల వినియోగం తగ్గించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని డీఆర్సీ ఏడీఏ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో వీఏఏ, రైతులకు జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ పంటల వ్యర్థాలను తగలబెట్టడం వల్ల భూమిలో ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశిస్తాయని పేర్కొన్నారు. ఖరీఫ్ పంట సాగులో మెలకువలు, వేసవి దుక్కులు, విత్తన ఎంపికను వివరించారు. మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలను 50 శాతం రాయితీపై సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వాటి కోసం రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీడీఏ జ్యోతి రమణి పాల్గొన్నారు.

హైస్కూల్‌లో ప్రవేశాలకు ఉపాధ్యాయుల కృషి

ముదినేపల్లి రూరల్: మండలంలోని వైవాక హైస్కూల్‌లో విద్యార్థుల ప్రవేశాలకు ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు. ఇప్పటి వరకు యూపీ స్కూల్‌గా ఉన్న పాఠశాలను ఇటీవలే హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు మంగళవారం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. హైస్కూల్ వల్ల కలిగే ప్రయోజనాలు దీనిని నిలబెట్టుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ పిల్లలను స్థానిక హైస్కూల్‌లోనే చేర్పించాలని కోరారు.

వైభవంగా గంగాభవానీ అమ్మవారి నెల జాతర



గంగాభవానీ అమ్మవారు

కోడూరు: భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారి నెల జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం అమ్మవారి ప్రధాన గుడి సంబరం నిర్వహించిన నెల రోజులకు మళ్లీ జాతర నిర్వహించారు. ఉదయం ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు దంపతులు అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, గాజులను సమర్పించారు. డప్పు వాయిద్యాల నడుమ గ్రామ మహిళలు నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. మెడలో గారెల దండలు ధరించి చలువ బట్టలపై వచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. అమ్మవారి మూలమూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయాన్ని వివిధ రకాల పుష్ప పరిమళాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ధర్మకర్త యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించగా, ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు

ముదినేపల్లి రూరల్: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వీరభద్రరావు హెచ్చరించారు. స్టేషన్‌లో స్థానిక విలేకరులతో మంగళవారం మాట్లాడారు. మండలంలో క్రికెట్ బెట్టింగులు నిర్వహించే వారిపై పూర్తి స్థాయిలో నిఘా ఉంచామన్నారు. ఇందులో భాగంగానే సోమవారం రాత్రి చిగురుకోటలో బెట్టింగ్ నిర్వహిస్తున్న ఎనిమిది మంది యువకులను అదుపులోకి తీసుకుని రూ.8 వేలు, 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సుల్తానగరంలో ఎక్సైజ్ దాడులు

కోనేరుసెంటర్: బందరు మండలం సుల్తానగరంలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం బెల్టుషాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన మోతుకూరి నాగబాబు అనే బడ్డీ వ్యాపారి వద్ద 10 ఎన్‌డీపీఎల్ (నాన్‌డ్యూటీపెయిడ్‌లిక్కర్) బీర్ బాటిళ్లను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ ఎం.రవి తెలిపారు. ఎక్సైజ్ సీఐ ఆదేశాల మేరకు ఈ దాడులు జరిపినట్లు ఆయన తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన రిలే నిరాహారదీక్ష



మచిలీపట్నంటౌన్: పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్‌కు చెందిన ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం రెండో రోజు కూడా కొనసాగాయి. స్థానిక బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన శిబిరంలో ఎస్.రాఘవరావు, రాఘవయ్య, కృష్ణమూర్తి, హనుమకొండ మెహర్‌బాబా, దాసరి శ్రీనివాసరావు దీక్షలో కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని సంఘ నాయకులు వడ్డి నాంచారయ్య, వీవీ రావు, ఎం.కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.